వైకుంఠ ఏకాదశికి ఏర్పాట్లు పూర్తి



గోదాదేవికి సామూహిక మంగళహారతి ఇస్తున్న మహిళలు

మన్సూరాబాద్: డివిజన్ పరిధి విజయశ్రీకాలనీలోని పద్మావతి గోదా సమేత శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం, ఆదిత్యానగర్‌కాలనీలోని లక్ష్మి పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి దేవాలయంలో శుక్రవారం వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని ఉత్తర ద్వార దర్శనానికి ఆయా ఆలయ కమిటీల ఆధ్వర్యంలో ఏర్పాట్లను పూర్తిచేశారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టారు.

- విజయశ్రీకాలనీలోని పద్మావతి గోదా సమేత శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో గోదా రంగనాథస్వామి ధనుర్మాస ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. 13న ఆలయంలో జరిగే గోదాదేవి కల్యాణోత్సవాలను పురస్కరించుకుని బుధవారం ఉదయం ఆలయంలో గోదాదేవికి సామూహిక మంగళహారతి కార్యక్రమాన్ని నిర్వహించారు.

రేపు ఉత్తర ద్వార దర్శనాలు

వనస్థలిపురం: వనస్థలిపురం డివిజన్ చింతలకుంట జనప్రియ హోమ్స్‌లోని శ్రీ గోదా పద్మావతీ సమేత వేంకటేశ్వరస్వామి దేవాలయంలో ధనుర్మాస విశేష కార్యక్రమాల్లో భాగంగా ఈ నెల 10న వైకుంఠ (ముక్కోటి) ఏకాదశిని పురస్కరించుకుని ఉదయం 5 గంటల నుంచి ఉత్తర ద్వార దర్శనం, విశేష పుష్పాలంకరణ, ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఫౌండర్, చైర్మన్ పీ.వీ.నరసింహారావు తెలిపారు. అలాగే 13న ఉదయం 10 గంటలకు గోదా రంగనాథుల కల్యాణ మహోత్సవం ఉంటుందన్నారు.

శ్రీ లక్ష్మీగణపతి దేవాలయంలో..

వనస్థలిపురంలోని శ్రీ లక్ష్మీగణపతి దేవాలయంలో వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఉత్తర ద్వార దర్శనం, సప్త ద్వారాల ఏర్పాట్లు, ఉచిత లడ్డూ ప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ బుద్దోలు అశోక్‌కుమార్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి డా.ప్రభాకర్, ఉపాధ్యక్షులు కంచి కృష్ణమోహన్, మిట్టా రామ్మోహన్, కోశాధికారి లక్ష్మణరావు, సభ్యులు బాలేశ్వర్, సురేష్, బ్రహ్మాచారి, రజని, సులోచన తెలిపారు.

కేటాయింపు ఇక్కడ.. ఫైర్ ఇంజిన్ అక్కడ

- ఎల్‌బీనగర్‌లో అందుబాటులో లేని అగ్నిమాపక శకటం
- స్థలం లేకపోవడంతో ఉప్పల్‌లో పార్కింగ్
- ప్రమాదాలు జరిగినప్పుడు వాహనం వచ్చే సరికే అపార నష్టం



ఉప్పల్ భగయత్‌లోని అగ్నిమాపక కేంద్రంలో ఎల్‌బీనగర్‌కు చెందిన ఫైర్ ఇంజిన్

నాగోలు: ఎల్‌బీనగర్ నియోజకవర్గానికి మంజూరైన అగ్నిమాపక శకటాన్ని పార్కింగ్ చేసేందుకు సరైన స్థలం లేక మరో ప్రాంతానికి తరలించారు. ఎన్నో ఏళ్ల తర్వాత ఎల్‌బీనగర్ నియోజకవర్గానికి అగ్నిమాపక వాహనం మంజూరు చేశారు. గతంలో ఎల్‌బీనగర్, సరూర్‌నగర్, కర్మన్‌ఘాట్, చంపాపేట, కొత్తపేట, నాగోలు, మన్సూరాబాద్, హస్తినాపురం ఇతర ప్రాంతాల్లో ఏదైనా అగ్నిప్రమాదం జరిగితే గతంలో హయత్‌నగర్, తార్నాక నుంచి ఫైర్ ఇంజన్లు వచ్చేవి. దూరంగా ఉన్న ఇతర ప్రాంతల నుంచి వచ్చే సరికి ఆస్తి, ప్రాణ నష్టాలు జరిగేవి. దీంతో గతంలో ప్రజానిధులు, కాలనీవాసుల విజ్ఞప్తి మేరకు గత ప్రభుత్వం ఎల్‌బీనగర్ నియోజకవర్గానికి అగ్నిమాపక కేంద్రాన్ని మంజూరు చేసింది.

సుదూర ప్రాంతం నుంచి..

అగ్నిమాపక కేంద్రం ఏర్పాటుకు మాత్రం స్థలం కేటాయించకపోవడంతో వాహనాన్ని కొన్ని నెలల పాటు తాత్కాలికంగా ఉప్పల్ భగయత్ ఉన్న స్థలంలో పార్కింగ్ చేసేవారు. ఎల్‌బీనగర్ నియోజకవర్గాని దూరంగా ఉన్న ప్రాంతంలో అగ్నిమాపక కేంద్రం ఉండడంతో ఎల్‌బీనగర్ ప్రాంతంలో జరిగే ప్రమాదాల నివారణ ఎలా సాధ్యమని ఎల్‌బీనగర్ నియోజకవర్గ వాసులు ప్రశ్నిస్తున్నారు. ఎల్‌బీనగర్ ప్రాంతంలో వివిధ డివిజన్‌లోని ఆయా ప్రాంతాలు, కాలనీలు, బస్తీలు మురికి వాడల్లో తరచూ అగ్ని ప్రమాదాలు జరుతున్నాయి.

అధికారుల ఉత్తుత్తి హామీలే..

అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు దూరంగా తార్నాక, హయత్‌నగర్ నుంచి రప్పించాల్సి వస్తుంది స్థానికులు పేర్కొంటున్నారు. గతంలో కొత్తపేటలోని గడ్డిఅన్నారం ఫ్రూట్‌మార్కెట్ స్థలంలో అగ్నిమాపక కేంద్రం స్థలం కేటాయిస్తామని గతంలో అధికారులు ప్రకటించారు. కానీ అక్కడ ప్రభుత్వ హాస్పిటల్ నిర్మాణంలో ఉండడంతో వీలు కాలేదు. త్వరలో వేసవి వస్తుంది. అగ్ని ప్రమాదాలు ఎక్కువగా జరిగే ఆస్కారం ఉంటుందని నియోజకవర్గానికి కేటాయించిన అగ్నిమాపక వాహనాన్ని ఎల్‌బీనగర్ ప్రాంతంలో స్థలం కేటాయించి నిరంతరం ఇక్కడే ఉండేలా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

హరిణ వనస్థలిలో ఎగిసిపడిన మంటలు

ఎల్‌బీనగర్‌లోని హరిణ వనస్థలి నేషనల్ పార్క్‌లో ఈ నెల7న (మంగళవారం) అగ్నిప్రమాదం చోటు చేసుకోవడంతో ఫైర్ ఇంజిన్‌కు సమాచారం ఇచ్చారు. ఉప్పల్ నుంచి వాహనం వచ్చే సరికి ఆలస్యమై ఎక్కువ శాతం చెట్లు కాలిపోయాయి. ఈ పార్క్‌లో వివిధ రకాల జంతువులు ఉంటాయి ఇంకాసేపైతే మంటలు మరింత వ్యాపించే ప్రమాదం ఉండేదని మూగజీవులు మృత్యువాత పడే ఆస్కారం ఉండేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒకవేళ ఎల్‌బీనగర్‌లోనే ఫైర్ ఇంజిన్ ఉండింటే క్షణాల్లో వచ్చి మంటలను అదుపు చేసేవారని ఎల్‌బీనగర్‌వాసులు పేర్కొంటున్నారు.



‘గూండాయిజానికి పాల్పడుతున్న కాంగ్రెస్’



సీఎం దిష్టిబొమ్మ దహనం చేస్తున్న బీజేపీ నాయకులు

మన్సూరాబాద్: రాష్ట్రంలో అధికారంలో ఉన్నామని కాంగ్రెస్ నేతలు గుండాయిజం చేస్తున్నారని బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి ఆరోపించారు. రాష్ట్ర బీజేపీ కార్యాలయంపై కాంగ్రెస్ నేతల దాడులను నిరసిస్తూ బుధవారం ఎల్‌బీనగర్‌లో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. ప్రజా సంక్షేమానికి, ప్రజల కోసం ప్రభుత్వం నడువాలని, పార్టీ కార్యాలయంపై దాడులు రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికే చెల్లిందన్నారు. కాంగ్రెస్ పార్టీ నిజస్వరూపం ప్రజలకు అవగతమయ్యిందని నిరసనలు తెలిపే పద్ధతులు కూడా తెలియని కాంగ్రెస్ నేతలు గుండాయిజానికి పాల్పడుతూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు కరువయ్యాయి. పార్టీ కార్యాలయంపై దాడి చేయడం హేయమైన చర్య అని, ఈ దాడులకు ప్రతిదాడులు ఉంటాయన్నారు. నిరసనలో కార్పొరేటర్లు నర్సింహారెడ్డి, పవన్‌కుమార్, అసెంబ్లీ కన్వీనర్ కొత్త రవీందర్‌గౌడ్, నాయకులు జక్కిడి ప్రభాకర్ రెడ్డి, అంజన్‌కుమార్‌గౌడ్, నాంపల్లి రామేశ్వర్, కలంశెట్టి లయ, కృష్ణంరాజు, మాధవి, హరీశ్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉత్సాహంగా ముగ్గుల పోటీలు



ముగ్గులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ పవన్‌కుమార్

నాగోలు: తెలుగు సంస్కృతి, సంప్రదాయాలకు నిలయం సంక్రాంతి పండగని కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ అన్నారు. న్యూ మారుతినగర్ వెల్ఫేర్ అసోసియేషన్ తరుపున రామరెడ్డి, సుజాత, పద్మ, సంతోషి రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన ముగ్గుల పోటీల్లో యువతులు, మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పవన్ కుమార్ పాల్గొని విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో లింగాల రాహుల్‌గౌడ్, క్రిష్ణమూర్తి ప్రభాకర్, కనుకయ్య, శ్రీనివాస్, శంకర్ రెడ్డి, నిరంకి రవి, మంచి రాజేష్ పాల్గొన్నారు.



బహుమతులు అందుకున్న మహిళలు

నిందితులను అరెస్ట్ చేయాలి

బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు రాఘవేందర్ ముదిరాజ్



మీర్‌పేట ప్రధాన రహదారిపై ధర్నా చేస్తున్న నాయకులు

మీర్‌పేట: బీజేపీ కార్యకర్తలు, కార్యాలయాలపై దాడులకు పాల్పడిన కాంగ్రెస్ నాయకులను వెంటనే అరెస్ట్ చేయాలని బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు చింతల రాఘవేందర్ ముదిరాజ్ డిమాండ్ చేశారు. ఎన్ఎస్‌యూఐ కార్యకర్తల దాడిని నిరసిస్తూ బీజేవైఎం నాయకులు బుధవారం మీర్‌పేట కూడలీలో రోడ్డుపై బైఠాయించి ధర్నా చేశారు. ఈ సందర్భంగా రాఘవేందర్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాలన విధ్వంసకరంగా సాగుతోందని, బీజేపీ కార్యకర్తల సహనాన్ని పరీక్షించొద్దని, ఇది పునరావృతం అయితే దాడులకు ప్రతిదాడులు తప్పవని హెచ్చరించారు. ముందుగా ప్రజలకు ఇచ్చిన హామీలపై కాంగ్రెస్ ప్రభుత్వం దృష్టి పెట్టాలన్నారు. అనంతరం సీఎం దిష్టిబొమ్మ దహనం చేసేందుకు యత్నించిన నాయకులను పోలీసులు అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. ధర్నాలో కార్పొరేటర్ భిక్షపతిచారి, అక్కి వినయ్‌గౌడ్ ప్రదీప్, సాయి పాల్గొన్నారు.

పూర్వ ప్రాథమిక విద్య పాఠ్య పుస్తకాల ఆవిష్కరణ



పుస్తకాలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

మీర్‌పేట: మహిళా, శిశు సంక్షేమ శాఖ ఐసీడీఎస్ ప్రాజెక్ట్ మహేశ్వరం, హయత్‌నగర్ సూపర్‌వైజర్లు బుధవారం మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ఆమె నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా పూర్వ ప్రాథమిక విద్య పాఠ్య పుస్తకాలను ఎమ్మెల్యే చేతుల మీదుగా ఆవిష్కరించారు. కార్యక్రమంలో మహేశ్వరం సీడీపీఓ శాంతి, హయత్‌నగర్ సీడీపీఓ రేణుక, సూపర్‌వైజర్లు ఇందిరా, భిక్షపమ్మ, శ్రీదేవి, శ్రీలత, జ్ఞానకుమారి పాల్గొన్నారు.

వేర్వేరు ఘటనల్లో ఇద్దరి అదృశ్యం



వెంకటేష్

హయత్‌నగర్: వేర్వేరు ఘటనల్లో ఇద్దరు అదృశ్యమైన ఘటన హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. హయత్‌నగర్ డివిజన్ రంగనాయకుల గుట్ట కాలనీకి చెందిన మొర్రబోయిన వెంకటేష్(38) డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. హైటెక్ సిటీలో డ్రైవర్‌గా ఉద్యోగం వచ్చిందని భార్య లావణ్యకు చెప్పి గత నెల 29న వెళ్లాడు. అదే రోజు రాత్రి భార్యకు ఫోన్‌చేసి తనకు నైట్ షిఫ్ట్ ఉందని మరునాడు వస్తానని చెప్పి ఎంతకీ రాలేదు. ఆందోళనకు గురైన లావణ్య బంధువులు, స్నేహితులతో ఆరా తీసినా ఫలితం లేకపోవడంతో బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది.

కొడుకుతో గొడవపడి..



లావణ్య

కొడుకుతో గొడవ పడిన ఓ పారిశుద్ధ్య కార్మికురాలు అదృశ్యమైంది. మునగనూరుకు చెందిన దోమలపల్లి లావణ్య(40) తుర్కయాంజాల్ మున్సిపాలిటీలో పారిశుద్ధ్య కార్మికురాలిగా పని చేస్తుంది. డబ్బుల విషయంలో కొడుకు శ్రీచరణ్‌తో గొడవ పడింది. మంగళవారం డ్యూటీకని వెళ్లిన లావణ్య రాత్రైనా రాకపోవడంతో పోలీసుకు ఫిర్యాదు చేశారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

అడిషనల్ సీపీ విశ్వప్రసాద్



అవగాహన ర్యాలీలో పాల్గొన్న అడిషనల్ సీపీ విశ్వప్రసాద్

సైదాబాద్: ట్రాఫిక్ నిబంధనలు తప్పకుండా పాటించాలని హైదరాబాద్ ట్రాఫిక్ అడిషనల్ సీపీ విశ్వప్రసాద్ సూచించారు. ట్రాఫిక్ భద్రతా మాసోత్సవాలను పురస్కరించుకొని బుధవారం సంతోష్‌నగర్ ట్రాఫిక్ పోలీసులు ఐఎస్‌సదన్ చౌరస్తాలో విద్యార్థులతో కలిసి నిర్వహించిన అవగాహన ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. ఐఎస్‌సదన్ చౌరస్తా నుంచి మాతృశ్రీ కాలేజీ వరకు సాగిన ర్యాలీలో వేద డిగ్రీ కాలేజీ, మాతృశ్రీ కాలేజీ విద్యార్థులు ప్లకార్డులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వప్రసాద్ మాట్లాడుతూ.. మద్యం తాగి వాహనాలు నడపరాదని ద్విచక్ర వాహనదారులు కచ్చితంగా హెల్మెట్ ధరించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీసీపీ ట్రాఫిక్-3 ఆర్.ఆర్.వెంకటేశ్వర్లు, సౌత్‌ఈస్ట్ జోన్ ట్రాఫిక్ ఏసీపీ చంద్రకుమార్, సౌత్ జోన్ ఏసీపీ లక్ష్మణ్, సంతోష్‌నగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నరసింహ నాయక్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లు అశోక్‌కుమార్, శ్రీను నాయక్ పాల్గొన్నారు.

నిధుల మంజూరుకు విజ్ఞప్తి



ఇలంబర్తికి మొక్కను అందిస్తున్న సుజాతానాయక్

హస్తినాపురం: డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం రూ.10 కోట్ల నిధులను మంజూరు చేయాలని హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ బానోతు సుజాతానాయక్ జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఇలంబర్తికి విన్నవించారు. బుధవారం జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో కమిషనర్‌ను కలిసి మాట్లాడారు. డివిజన్ పరిధిలోని చాలా ప్రాంతాలలో నూతన కాలనీలు పెరుగుతున్నాయని పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ప్రజలకు మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

జెడ్సీకి వినతి..

నాగోలు: నాగోలు డివిజన్ అభివృద్ధి, సమస్యల పరిష్కారానికి నిధులు మంజూరు చేయాలని నాగోలు డివిజన్ కార్పొరేటర్ చింతల అరుణ సురేందర్ యాదవ్ బుధవారం జీహెచ్‌ఎంసీ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్ కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. నాగోలు డివిజన్ పరిధిలోని పలు కాలనీలలో వీధి దీపాలు, రోడ్లు, పార్కు అభివృద్ధి కోసం నిధులు మంజూరు చేయాలన్నారు.

ముదురుతున్న పైప్‌లైన్ వివాదం



సమస్యను విన్నవించుకుంటున్న రైతులు



మాట్లాడుతున్న బహదూర్‌పురా ఎమ్మెల్యే ముబీన్

- రైతు బజార్‌ను పరిశీలించిన ఎమ్మెల్యే, జోనల్ కమిషనర్
- రైతు బజార్ నుంచి లైన్ వేయరాదని కూరగాయల రైతుల ఆందోళన

చాంద్రాయణగుట్ట: ఫలక్‌నుమా రైతుబజార్‌లో పైప్‌లైన్ వివాదం రోజు రోజుకూ ముదురుతుంది. అసలే ఇరుకుగా ఉన్న రైతు బజార్‌లో నిత్యం ఇబ్బందులు పడుతుంటే.. అందులో నుంచే ఎగువ బస్తీలకు సంబంధించిన మురుగు నీటి కాలువను రైతుబజార్ మధ్యలో నుంచి వేసేందుకు జీహెచ్‌ఎంసీ అధికారులు సిద్ధమవడంతో కూరగాయల రైతులు ఆందోళన బాటపట్టారు. 45 రోజుల నుంచి అటు జీహెచ్‌ఎంసీ అధికారులు.. ఇటు కూరగాయల రైతుల మధ్య ఈ వివాదం కొనసాగుతుంది. ఈ క్రమంలోనే రైతులు ఇటీవల డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కను కలిసి విన్నవించుకోవడంతో పాటు ఈ నెల 7న జీహెచ్‌ఎంసీ జోనల్ కమిషనర్ కార్యాలయం ముందు ఆందోళన నిర్వహించి జడ్సీకి సమస్యను విన్నవించుకున్నారు.

రైతు బజార్‌ను సందర్శించిన ఎమ్మెల్యే, జోనల్ కమిషనర్..

పైప్‌లైన్ వేసేందుకు రైతుబజార్ ఎస్టేట్ అధికారులు, రైతులు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో బుధవారం ఉదయం బహదూర్‌పురా ఎమ్మెల్యే ముబీన్, జోనల్ కమిషనర్ వెంకన్న రైతుబజార్‌ను పరిశీలించారు. ఇంజినీరింగ్ అధికారులతో కలిసి పైప్‌లైన్ వేసే రూట్‌ను పరిశీలించారు. ఎగువన ఉన్న మదీనా కాలనీలో లెవలింగ్ సమస్య కారణంగానే రైతుబజార్ మీదుగా లైన్‌ను వేయాల్సి వస్తుందని అధికారులు రైతులకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. డ్రైనేజీ మురుగు నీరు రైతుబజార్‌లో లీకేజీలు అవుతుందని, మ్యాన్‌హోళ్ల పైకప్పుల నుంచి వచ్చే దుర్వాసనతో ఇక్కడ కూరగాయల వ్యాపారం దెబ్బతింటుందని రైతులు చెప్పుకొచ్చారు. ఈ సమయంలో కొందరు మజ్లిస్ నాయకులు రైతుల పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. ముందు పేర్కొన్నట్లుగా రైతు బజార్‌లో రెండు గేట్ల వైపు రెండు లైన్లు కాకుండా ఒకే గేట్ ఒక లైన్‌ను మ్యాన్‌హోల్ రాకుండా వేస్తామని అధికారులు చెప్పి వెళ్లిపోయారు.

ఇబ్బందులు కలగకుండా చూస్తాం: ఎమ్మెల్యే

రైతు బజార్‌కు ఎగువన ఉన్న మదీనా కాలనీ ప్రజలకు, ఇటు రైతుబజార్ ఎస్టేట్ అధికారులు, రైతులకు ఇబ్బందులు లేకుండా లైన్ వేస్తామని ఎమ్మెల్యే మహ్మద్ ముబీన్ మీడియాతో తెలిపారు. మదీనా కాలనీలో లెవలింగ్ సమస్య ఉందన్నారు. రైతుబజార్‌లో కూడా మ్యాన్‌హోల్ ఇవ్వకుండా త్వరితగతిన పైప్‌లైన్ వేస్తామన్నారు.

మా పొట్ట కొట్టొద్దు..



ఊరిలో పండించిన కూరగాయలను ఏళ్ల తరబడి నుంచి ఈ రైతుబజార్‌కు తీసుకొచ్చి విక్రయిస్తున్నాం. దాదాపు 200 మంది రైతులం విక్రయాలు జరుపుతుండగా రెండు వేల మంది వరకు వినియోగదారులు వస్తుంటారు. ఇప్పటికే ఇరుకుగా ఉన్నప్పటికీ సర్దుకొని జీవనోపాధి పొందుతున్నాం. అలాంటి రైతు బజార్‌లో భారీ పైప్‌లైన్లు వేస్తే నిత్యం మురుగునీరు పారే అవకాశం ఉంది. అధికారులు ఆలోచించి ప్రత్యామ్నాయ రూట్‌లో లైన్ వేసుకోవాలి.

– యాదమ్మ, రైతు, నేదునూర్

రైతు బజార్‌లలో కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్, వనస్థలిపురం రైతు బజార్‌లలో కూరగాయల ధరల వివరాలు.. టమాటా రూ.15, వంకాయ రూ.23, బెండ రూ.50, పచ్చిమిర్చి రూ.40, కాకరకాయ రూ.45, బీరకాయ రూ.45, కాలిఫ్లవర్ రూ.18, క్యాబేజీ రూ.13, క్యారెట్ రూ.35, దొండ రూ.45, ఆలుగడ్డ రూ.28, ఉల్లిగడ్డ రూ.39, గోకరకాయ రూ.28, దోసకాయ రూ.19, సొరకాయ రూ13, పొట్లకాయ రూ.18, అరటికాయ రూ.09, చిక్కుడుకాయ రూ.45, చామగడ్డ రూ.40, మునగ రూ.85, చిలుకడ దుంప రూ.60, బీట్‌రూట్ రూ.35, కీర రూ.35, బీన్స్ రూ.45, క్యాప్సికమ్ రూ.41. ఈ ధరలు గురువారం ఉదయం 9 గంటల వరకు వర్తిస్తాయి.

నియామకం



నియామకపత్రం అందుకుంటున్న సయ్యద్ యూసుఫ్

నాగోలు: కాంగ్రెస్ పార్టీ సేవాదల్ కొత్తపేట డివిజన్ అధ్యక్షుడిగా సయ్యద్ యూసుఫ్‌ను నియమించారు. ఈ మేరకు బుధవారం కాంగ్రెస్ పార్టీ సేవాదల్ అధ్యక్షుడు మిద్దెల జితేందర్ యూసుఫ్‌కు నియమక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా యూసుఫ్ మాట్లాడుతూ.. కొత్తపేట డివిజన్‌లో కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ బలోపేతానికి నిరంతరం కృషి చేస్తానన్నారు.

మల్టీమీడియా టెక్నాలజీలో శిక్షణ



మలక్‌పేట: అరేనా యానిమేషన్ ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో దిల్‌సుఖ్‌నగర్‌లో కొత్త సెంటర్ ఏర్పాటు చేశారు. గ్లోబల్ రిటైల్ బిజినెస్ చీఫ్ ఆఫీసర్ సందీప్ వెలింగ్ ఈ సెంటర్‌ను ప్రారంభించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా సందీప్ మాట్లాడుతూ.. గేమింగ్, గ్రాఫిక్ డిజైన్, మల్టీమీడియా టెక్నాలజీలో ప్రపంచ స్థాయి శిక్షణను విస్తరిస్తున్నట్లు తెలిపారు. సరికొత్త సాధనాలతో, సాంకేతికతలను విద్యార్థులకు అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. ఏవీజీసీ (యానిమేషన్, వీఎఫ్ఎక్స్, గేమింగ్, కామిక్స్ పరిశ్రమ)లో చేరాలని ఆకాంక్షించే యువతకు చక్కని అవకాశమన్నారు.

డైరీ ఆవిష్కరణ



డైరీ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బలాల

మలక్‌పేట: క్రైస్తవుల సమస్యలు పరిష్కారానికి ప్రత్యేక చొరవ తీసుకుంటానని మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల అన్నారు. మలక్‌పేట నియోజకవర్గ పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన సంవత్సర డైరీని బుధవారం పంజేషాహలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎర్రోళ్ల మాణిక్యం అబ్రాహం, శాంతకుమార్, శ్రీధర్ రాజు, నవీన్, ముఖేష్, ధన్‌రాజ్ పాల్గొన్నారు.

నేషనల్ సేఫ్టీ కౌన్సిల్ మెంబర్‌గా జయస్వామి



మలక్‌పేట: మలక్‌పేటకు చెందిన కాంగెస్ సీనియర్ నేత డాక్టర్ ఎస్. జయస్వామి ది బోర్డు ఆఫ్ గవర్నర్స్ నేషనల్ సేఫ్టీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా మెంబర్‌గా, రంగారెడ్డి జిల్లా ఎక్స్‌పర్ట్ ఇండస్ట్రీయల్ సేఫ్టీ అండ్ హెల్త్ క్రైసీస్ గ్రూప్ సభ్యులుగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్ ఆయన్ను సన్మానించి అభినందనలు తెలిపారు. తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతలను శక్తివంచన లేకుండా నిర్వర్తించడానికి కృషి చేస్తానని జయస్వామి పేర్కొన్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

నాగోలు: ప్రమాదంలో గాయపడిన గుర్తు తెలియని వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన నాగోలు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. గత నెల 26న నాగోలు ప్రాంతంలో గుర్తు తెలియని ఓ వ్యక్తి కిందపడి కాలు విరగడంతో 108 సిబ్బంది, నాగోలు పోలీసులు చికిత్స కోసం సికింద్రాబాద్‌లోని గాంధీ హాస్పిటల్ తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడు నాగోలు వీధుల్లో భిక్షాటన చేస్తుండేవాడని స్థానికులు వెల్లడించారు.